# రత్తాలు

పి. రాజ్యలక్ష్మి

మనసు ఉంటుంది. మమత ఉంటుంది. నిజాయితీ ఉంటుంది. మమతానుబంధాన్ని తెంచుకొంటే మనశ్శాంతి కరువు అవుతుందని తెలిసి ఉంటుంది. అయినా అదెక్కడి విధి విధానమో తెలియదు కాని, మమతానుబంధాన్ని చేజేతులా తెంచుకొనడమే జరుగుతుంది, మరి!

చంద్రం హడావిడి ఎప్పుడూ ఉన్నదే.

హాస్పిటల్‌నించి వచ్చిందో అడుగు. రానిదో అడుగు.

"అర్జెంటుగా వడ్డించెయ్యి, అమ్మా. తొందరగా వెళ్లిపోవాలి" అంటాడు. ఆపరేషనులు ఉన్న రోజున ఇంక చెప్పనే అక్కర్లేదు. ఒకటే ఉరుకులూ, పరుగులూ. నిలబడడు, నిలబడనియ్యడు. ఈ రెండేళ్లనించీ, ముఖ్యంగా ఈ ఊరు బదిలీ అయినప్పటినించీ ఈ హడావిడికీ కంగారుకీ రత్తాలు బాగా అలవాటు పడిపోయింది. తన ముఖాన్ని చూసుకోకుండా రాత్రిం బగళ్లు రోగుల సేవలో మునిగి తేలుతున్న కొడుకుని చూస్తూంటే ఓపక్క 'ఇంతటివాణ్ణి తయారు చెయ్యగలిగాము కదా' అని సంతృప్తితో కూడిన ఆనందం, మరో పక్కన 'అయ్యో కుర్ర నాగమ్మ నలిగిపోతున్నాడే! ఆయన ఆశయాన్ని నెరవేర్చాలనే పట్టుదలతో ఈ డాక్టరీ చదివించి కుర్రవాణ్ణి ఎంత శ్రమ పెడుతున్నానో' అని పశ్చాత్తాపంతో కూడిన విచారం. ఈ రెండింటికీ మధ్య ఊగిసలాడుతూ ఉన్నాళ్లూ చంద్రం హాస్పిటల్‌కీ ఇంటికీ మధ్య చేస్తున్న పరుగు పందాలు చూస్తూ ఏమీ కల్పించుకోలేకుండా ఊరుకుంది.

కాని, ఈవేళ అతని కంగారు వట్టి కంగారు మాత్రమే కాదు. దాని వెనకాల ఎంతో ఆవేదనా, ఎంతో ఆందోళనా, మరెంతో బాధా కనిపిస్తున్నాయి రత్తాలుకి. అందుకే మామూలులాగ ఊరుకోలేకపోయింది. అసలు ఏం జరిగిందో, అతని మొహంలో అంత దిగులు ఎందుకు కనిపిస్తూందో తెలుసుకోవా లనుకుంది. అందుకే వడ్డించిన వేడి వేడి అన్నం చల్లారడం కోసం పక్కనే పీటమీద కూర్చుని విసురుతూ, "ఏమిరా, అబ్బాయి! ఇవాళ అలా ఉన్నావు?" అంది.

పరధ్యానంగా ఉన్న చంద్రం ఉలిక్కిపడి, "ఏమిటమ్మా?" అన్నాడు.

రత్తాలు నవ్వుతూ, "ఏమిటి ఆలోచిస్తున్నావ్? చెయ్యబోయే ఆపరేషన్ని గురించా?" అంది.

"చెయ్యబోయేది కాదమ్మా. చేసిన దాన్ని గురించే."

"చేసేసిన దాన్నిగురించి ఇంక ఆలోచన ఏమిటి?"

"ఆపరేషన్ అయితే చేసేశాననుకో. కాని ఆయన బ్రతుకుతాడా అన్నదే అనుమానం."

"అంత ప్రమాదమైన జబ్బా?"

"క్యాన్సర్ తాలూకు విషం నేను ఆపరేషన్ చెయ్యడానికి ముందే రక్తంలో ప్రవేశించింది. అలాంటప్పుడు బతకడం కష్టం."

"అయ్యో, పాపం! వయస్సెంతా?"

"దగ్గిర దగ్గిర ఏభై ఉండచ్చు."

"భార్యా...పిల్లలూ...?"

"ఎవరూ ఉన్నట్లు లేదు. కాని, ఓ పిల్లాడు ఉన్నాట్ట!"

"అయ్యో! ఎవరో దిక్కులేని బీదవాడు కాబోలు" అంటూ రత్తాలు చంద్రానికి అన్నం వడ్డించింది.

"కాదమ్మా, చాలా శ్రీమంతుడు. పైగా ఎంతో మంచివాడుట కూడా. ఎన్నో సంస్థలకీ ఎందరో బీద విద్యార్థులకీ సాయం చేస్తూ ఉంటాడుట. ఆయన కో కొడుకు కూడా ఉన్నా వాడెందుకూ పనికిమాలిన వాడుగా తయారయి చదువూ సంధ్యా లేకుండా పట్నంలో ఉంటూ ఉంటాడుట! కొత్తగా వచ్చాం కనక మనకి తెలియదు కాని మా హాస్పిటల్ స్టాఫ్ అంతా ఎరుగుదురుట! ఏదో ఊరు జమీందారుట కూడా" అంటూ చంద్రం చెప్పుకుపోతూంటే రత్తాలు, "అహా" అంటూ యథాలాపంగా వింటూ అతనికి మజ్జిగ పొయ్యడంకోసం గిన్నె ఎత్తింది.

"ఆఁ, జ్ఞాపకం వచ్చింది. పల్లయ్యగూడెం అని ఇక్కడ కో ఏభై మైళ్ళ దూరంలో ఉంది. దానికి జమీందారుట ఆయన."

"ఆఁ!" అని రత్తాలు ఒక్క కేకవేసి చేతిలో ఉన్న గిన్నె వదిలేసింది. అది చూసి చంద్రం కంగారుపడి, "అదేమిటమ్మా, అలా అరిచి గిన్నె వదిలేశా వేమిటి?" అంటూ ఆదుర్దాగా అడిగాడు.

"అబ్బే! ఏం లేదు, ఏం లేదు" అంటూ రత్తాలు తన ముఖంలో ఏర్పడ్డ వైవర్ణ్యాన్నీ; తన కళ్లలో నిలిచిన నీళ్లనీ కనిపించకుండా కప్పిపుచ్చడానికి ప్రయత్నించింది.

చంద్రానికి ఆమెలో వచ్చిన ఈ హఠాత్పరిణామానికి గల కారణం ఏమిటో అర్థం కాక అన్నం కలుపుకోవడం మానేసి, కంచంలో చెయ్యి అలాగే ఉంచేసి ఆమెకేసి చూస్తూ ఉండిపోయాడు.

ముఖ కవళికలనిబట్టి లోపల పడుతున్న ఆరాటాన్ని చంద్రం ఎక్కడ కనిపెడతాడో అనే భయంతో రత్తాలు, "అట్టముట్టునే ఉండిపోయా వేమిటి? అర్జెంటుగా వెళ్లాలన్నావు కదా. చప్పున భోజనం చేసి వెళ్ళు" అని కసురుకుంది.

చంద్రం సమాధానం ఏమి చెప్పకుండా రెప్ప లార్పకుండా ఎర్రని చెరువుల్లా మారుతూన్న ఆమె రెండు కళ్లకేసీ చూడసాగాడు. రత్తమ్మ వెంటనే పైటతో కళ్లు ఒత్తుకుని సర్దుకుంటూ, "మరేంలేదు, బాబూ! పల్లయ్యగూడెం అంటే మా అయ్య జ్ఞాపకం వచ్చాడు. మా అయ్య ఆ ఊళ్ళో ఉండేవాడులే. నువ్వు కడుపున పడేదాకా నేనూ అక్కడే ఉన్నాను. ఏవో... మా అయ్య, నా చిన్నతనం అన్నీ జ్ఞాపకం వచ్చి..." అంటూ మాట మధ్యలోనే ఆపు చేసింది.

చంద్రం "అహా" అని మాటవరసకి అన్నాడే కాని అమ్మ అలా ఉలిక్కిపడి బాధ పడడానికి గల బలీయమైన కారణం ఏమిటా అని తర్కించుకుంటూనే ఉన్నాడు.

"బాబూ! ఆయన్ని ఎలాగైనా నీ తెలివితేటలూ శక్తి సామర్థ్యాలూ అన్నీ ఉపయోగించి బతికించు" అని వెళ్లబోతున్న చంద్రంతో అందాం అని నోటిదాకా వచ్చి కూడా 'చెప్పలేమిటి? రక్త స్పర్శ అదే తెలుస్తుంది. అందుకే వాడంత దిగులుగా ఉన్నాడు' అని ఊరుకుంది రత్తాలు. తీరా చంద్రం వెళ్లిపోయాక 'చెప్పిఉండవలసిందే' అనుకుని బాధపడింది. చెబితే "సంగతేమిటి?" అని ఆరాతీసి అనుమానించి ఉండును అని భయపడింది. ఇలా బాధతో, భయంతో, వ్యాకులతతో ఆయన ఎలా ఉంటారో అనే ఆవేదనతో మనస్సు ఏమీ స్తిమితంలేక పిచ్చిదానిలాగు నాలుగు గదుల్లోనూ తిరగ సాగింది. ఏం జరుగుతూందో అనే బెంగతో గుండె బరువెక్కిపోగా, వెంకటేశ్వరస్వామి ఫోటో దగ్గిరికి వెళ్లి భోరున ఏడ్చి 'ఆయనకి తగ్గి నెమ్మదిస్తే నీ కొండకి వస్తాను' అని మొక్కుకుంది. దేవుడి పాదాలదగ్గిర తలపెట్టుకుని ఎక్కి ఎక్కి ఏడ్చి తరవాత సరిగేత్తుకుని వెళ్లి సందువాపెట్టె తెరిచింది.

పెట్టె అట్టడుగున పాతచీరలో రహస్యంగా భద్రం చేసిన 'కుమార్' ఫోటోతీసి గుండెల కద్దుకుంది. నవ్వుతూన్న ఆ ఫోటో చూసేసరికి దాదాపు పాతికేళ్లకితం తాను మొదటిసారిగా చూసిన కుమార్ రూపం కళ్లలో మెదిలింది రత్తాలుకి.

అప్పటికి తానింకా రత్తాలుగా మారలేదు. పదహారు సంవత్సరాల పొలపొంగులో ఉన్న 'రత్నం' మాత్రమే. ఆయన కూడా మగటిమి అంతా ప్రతి అణువులోనూ నింపుకొన్న పాతిక ముప్ఫయి ఏళ్ల అందగాడు. రోజూ లాగే తాను ఆ రోజు కూడా కడవ చంకని పెట్టుకుని కూనిరాగాలు తీస్తూ గెంతుకుంటూ కాలవ దగ్గిరికి వెళితే, రేవుకి దగ్గిర్లో కాలవ గట్టుమీద పచ్చ గడ్డిలో సడుకొని ఒక్కొక్క గడ్డిపరకేతుంపి కాలవలోవేస్తూ అది ఎంత దూరం పోతూందో చూస్తూ, కనిపించడం మానేశాక ఇంకోటి తుంపివేస్తూ కనిపించారు. తను చటుక్కున ఆయన్ని చూసి ఆగిపోయింది.

సిల్కు లాల్చీ, తెల్లని గ్లాస్కో పంచె, ఖరీదైన కళ్లజోడు, చేతికి వాచీ — ఈ కొత్తాయన ఎవరు చెప్మా? ఈయనకీ రేవు దగ్గిర పనేమిటి? చిన్న పిల్లాడిలాగ ఆ గడ్డిపరకలు తుంపివెయ్యడం ఏమిటి నీళ్లలో? మతిలేని మనిషిలా ఉన్నాడు. అసలు ఇటు తిరిగి చూడడేం? కావాలని కడవ చప్పుడయ్యేలాగ నీళ్లల్లో ముంచింది తను. ఉహుఁ! తల ఇటు తిప్పలేదు. ఎవరో పిచ్చివాడు, పోనిద్దూ అని కడవ భుజాన్ని పెట్టుకొని బయలుదేరింది. కాని, పచ్చగా బలంగా అందంగా ఉన్న ఆయన్ని ఇంకా చాలాసేపు చూడా లనిపించింది. అందుకే ఆ రోజున అవసరం లేకపోయినా మళ్లీ మళ్లీ కాలవకి వచ్చింది తను కడవ పుచ్చుకొని.

ఆ రోజునుండి ప్రతి రోజూ తను కాలవకి వెళ్ళే వేళా ఆ సిల్కు లాల్చీ అందగాడు మోచెయ్యి గడ్డిలో ఆన్చుకొని నీళ్లకేసి పిచ్చిగా చూస్తూ కూర్చునే వేళా ఒకటే. ఇలా ఎన్ని రోజులు గడుస్తున్నా తను ఒళ్ళంతా

# రత్నాలు

కళ్ళు చేసుకొని ఆ మహారాజుని చూడ్డమే కాని ఆయన ఒక్కమాటు ఇటు కళ్ళు తిప్పి చూడందే!

ఓ రోజున కడవ చంకన పెట్టుకుని ఆయనకేసి ఆశ్చర్యంగా చూస్తూ నిలబడిపోయిన తాను, కాలవ గట్టునే పొలం నించి వస్తూన్న అయ్యని చూసి కంగారుగా నీళ్ళు ముంచుకొని ఏమీ ఎరగనిదానిలా ఇంటికి బయలుదేరింది. ఇంతలో అయ్య ఆ సిల్కు లాల్చీ ఆయన్ని చూసి చుట్ట తీసేసి అవతల పారేసి దణ్ణం పెడుతూ, "ఇక్కడ కూచున్నారేమిటి, బాబూ?" అన్నాడు.

ఆ రాత్రి భోజనాల దగ్గిర నెమ్మదిగా తాను కదిపితే మాటల ప్రస్తావనలో అయ్య చెప్పాడు. "మన ఊరు జమీందారు ఆయనే! పెద్ద చదువులు చదివి పట్నంలో ఉంటూ పొలాలన్నీ అమరకం ఇచ్చేశారు. మేం చేస్తున్న భూమే కాకుండా ఈ ఊళ్లో సగం పైన రైతులు చేస్తూండే భూములన్నీ ఆయనవే! పాపం, ఈ మధ్యనే భార్య పోతే, ఏడాది సలుసుని తీసుకుని పట్నంలో ఉండలేక గ్రామం వచ్చేశారు."

అది వింటే తనకి జాలి కలిగి, 'అయ్యో, పాపం మహారాజుకి ఎంత కష్టం వచ్చింది' అనుకుంది. పైగా ఆయనకి అయ్యగాని అమ్మగాని తోడబుట్టినవాళ్లుగాని ఎవ్వరూ లేరుట. అది వింటే తనకి ప్రాణం మరీ విలవిల్లాడింది.

ఆ రాత్రి పడుకుం వచ్చేవేళకి, "అమ్మా! పెరుగు ముంతలు కావిట్లో సర్దెయ్యి" అని అయ్య రోజూలాగే అన్నప్పుడు, "ఇవాళ నా కేదో దిగులుగా ఉంది. నువ్వు వెళ్లకు. ఒక్కత్తినీ ఉండలేను" అంది తను. అయ్య నవ్వి, "భయమేమిటే పిచ్చితల్లీ, రోజూ ఉండడంలే! పెద్ద లోగిట్లో పిల్లలాగ ఆ భయమేమిటి?" అన్నాడు. "అయినా నువ్వు రోజూ రాత్రిళ్ళు వెళ్లి పొద్దుటే ఆ పట్నంలో పెరుగు అమ్మి కష్టపడ్డం ఎందుకు? కమతం చేస్తున్నాం కదా? జమీందారుగారికి ఇచ్చే ముక్త పోగా పొలంమీద వచ్చేది మనకి చాల దేమిటి?" అంది తను. అయ్య లదోలా నవ్వి, "పొలంమీద వచ్చినది మన రెండు పొట్టలకీ సరిపోయేటప్పటికి గగనం అవుతూంది. ఇంక నాలుగు రాళ్ళు వెనకెయ్యాలన్నా, నిన్నో లయ్య కిచ్చి పెళ్లిచేసి అత్తారింటికి పంపాలన్నా ఈ పెరుగు వ్యాపారమో ఏదో లేకపోతే ఎలా? ఆఁ అన్నట్టు లచ్చన్నని ఎరుగుదువుగా? వీరయ్య బావ కొడుకు. పట్నంలో ఫాక్టరీలో పని చేస్తున్నాట్ట. నిన్న కనిపించాడు. ఎంతయ్యా డనుకున్నావ్? చెయ్యెత్తు మనిషి అయ్యాడు. మొసకట్టూ వాడూ చూస్తే ముచ్చటేసింది. ఏదో అల్లాంటాడి చేతిలో నిన్ను పెట్టేస్తే నాకే దీకూ చింతా ఉండదు. ఆఁ! ఆ లచ్చన్నగాడు నీ కిష్టమేనా? అదూ నీలాగే అయిదో కళాసు చదివాట్ట! చెప్పు తల్లీ, నీ కిష్టమేనా" అని అయ్యరొక్కిస్తూంటే, "ఫో, అయ్యా!" అంది సిగ్గుతో తను. అయ్య నవ్వుకుంటూ కావిడి బుజాన్ని వేసుకున్నాడు.

జీవితంలో మొదటిసారిగా సిగ్గు అంటే ఏమిటో తెలిసింది ఆ రోజునే! అంతక్రితం తనకి అలా సిగ్గు అనిపించలేదు ఎప్పుడూ. ఏమైనా చూస్తూంది కదూ? తనలో ఎన్నెన్నో మార్పులు వస్తూఉండడం తనకే తెలుస్తూంది. పరధ్యానం ఎక్కువవుతూంది రోజు రోజుకీ అని లయ్యచేత ఎన్ని మాట్లో నన్నవన్నగా చివాట్లు తిన్నది ఈమధ్య. అవును. పూర్వంలాగ కాదు తను ఇప్పుడు, మరి!

తూర్పు పడమర కొండలమీద సూర్యుడు పూసే బంగారు పూతల్నీ, చంటమామ వేసే వెండి గిలాబాల్నీ చూస్తూంటే ఎన్ని మాట్లో తనకి ఒళ్ళు తెలియని ఆనందం కలిగింది ఈమధ్య. తన చుట్టూ ఉన్న లోకాన్ని మరిచి ఆ అందాన్ని చూస్తూ ఎంతెంతసేపో నిలబడిపోతూంది. ఎగిరే పక్షుల్ని చూస్తూంటే ఏదో సంతోషం. వానాకాలంలో ఓమూల హోరున వాన కురుస్తూంటే, మరో మూల నీరు పొర్లిపోయి గట్లు దాటి గంతులేస్తూంటే వాటితోపాటు తనలో కూడా ఏదో తెలియని ఆనందం గంతులు వేసేది. శీతాకాలంలో చలిగాలులూ, ఉగాది రోజుల్లో బరువైన మామిడి గుత్తుల ఊగిసలా తనకి ఒక రకంగానే చక్కిలిగింతలు పెట్టేవి.

పక్కన పడమట పోయే పంటకాలవ. కాలవ పక్క కొబ్బరితోట. ఆ కొబ్బరి, మామిడి, దబ్బ, దానిమ్మ చెట్ల మధ్య ఉన్న ఆ పెద్ద పూరి పాకలో తాను. పగలు దూరంగా ఉన్న పనిచేసుకీ, రాత్రి దగ్గిర్లో ఉన్న పట్టణానికి పోతూ తన సంగతే పట్టించుకోని అయ్యని చూస్తూంటే ఓ పక్కనించి కోపం, అయ్య లేకుండా తాను ఒక్కత్తే ఈ తోటలో రాత్రింబగళ్ళు ఉంటున్నానని ఇంకో పక్కనించి భయం. ఈ భయ కోపాల మధ్య చేసే దేం లేక అప్పుడప్పుడు ఆపుకోలేనంత దుఃఖం. చూస్తూంది కదూ? తనకి జ్ఞానం వచ్చాక ఇలా ఎప్పుడూ లేదు. అలాంటిది ఇప్పు డిలా ఉంటూంది, ఏమిటో!

తన స్నేహితులు ఆవుదూడ, జున్ను కోళ్ళు, బాతులు. ఇవి కూడా తనతో హాస్యం చేస్తున్నాయి. ఛెంగున రెండు అడుగులు వేస్తే అందేవి, ఈమధ్య చెంగు బొడ్లో దోపుకుని ఆయాసం వచ్చేలా పరిగెత్తినా అందడంలేదు. బహుశా పూర్వంలాగ తను పరిగెత్తలేకపోతూందేమో! ఏమో! ఎలాగేనా ఒళ్ళు పూర్వంలాగ జీలుగు బెండులాగ తేలిగ్గా ఉన్నట్లు అనిపించడంలేదు. ఓ రోజున ఆవుదూడ తనకి అందకుండా కాలవ గట్టు దాకా తీసుకుపోయి తిప్పింతాలు పెడుతూంటే, దాని వెనకాల పరిగెత్తి పరిగెత్తి అలిసిపోయి అటు చూస్తే, రెప్పవాల్చకుండా తనవేపే చూస్తూ మధ్య మధ్య చిన్నగా నవ్వుతూన్న ఆ జమీందారుగా రబ్బాయి! తనకి ప్రాణం చచ్చిపోయింది. సిగ్గుతో తను వెనక్కి తిరిగి వస్తూంటే, "దూడని నేను పట్టుకున్నాను. ఇదిగో, తీసుకువెళ్లు" అని కన్నె తాడు తనకి అందించి తన కళ్లలోకి కళ్ళుపెట్టి చూశారు. అబ్బ! ఒళ్ళు అప్పుడు ఎంత ఝల్లుమంది అని!

> మనం వెలుగుగా పరిగణించేది భగవంతుని నీడ.
>
> —ప్లేటో

ఇంకో రోజున సాయంత్రం వాకిట్లో ఒత్తుగా కళ్లాపు చల్లి వంగుని అందంగా ముగ్గులు పెడుతూంటే దగ్గరగా వచ్చి ఎవళ్ళో నించున్నట్లనిపించింది తనకి. తల ఎత్తి చూస్తే ఆయన! "దాహంగా ఉంది. కొబ్బరి నీళ్ళున్నాయా?" అన్నారు. తనని ఆయన పలకరిస్తారని కలలో కూడా అనుకోలేదేమో, ఒక్కక్షణం మెదడేం పని చెయ్యకుండా అలాగే ఉండిపోయింది. వెంటనే ఆయనికి సమాధానం చెప్పాలి అనే జ్ఞానం రాగా, "మరి, అయ్య లేడు. చెట్టు ఎవరు ఎక్కుతారు? మజ్జిగ ఉంది, మరి" అంది భయంతో వణుకుతున్న కంఠంతో తను. ఆయ నేం సమాధానం చెప్పకుండా వెనక్కి తిరిగి వెళ్లిపోయారు నెమ్మదిగా అడుగులు వేసుకుంటూ.

తరవాత అనుకుంది తను.

'ఎంత పొరబాటు చేశాను! ఆయన తోటకి ఆయన వచ్చి కొబ్బరినీళ్లు కావాలని నోరు విడిచి అడిగితే ఆయన చెట్టువి ఆయనకి ఇవ్వకుండా పంపించేశాను. ఏమిటి చెయ్యడం? చేసిన తప్పు ఇప్పుడు దిద్దుకోవడం ఎలా?' ఇలా ఆలోచిస్తూ ఉండిపోతే చేతిలోంచి ముగ్గు ధారగా కారిపోయి, జున్నుకోళ్ల కాళ్ల ఆనవాళ్ళు పడి చిందరవందరగా ముగ్గు అంతా కలిసిపోయి అదొక అందంగా ఉంది.

వెంటనే వెళ్లి గడక్రరకి డొంకి కట్టి ఓ లేత కొబ్బరి కాయ కోసి కత్తితో అందంగా చెక్కి కాలవ దగ్గిరికి వెళ్ళింది ఆయనకి అందించడంకోసం. ఆయన అటు తిరిగి కూర్చున్నారు. 'ఇది మీ కోసం!' అని అందామని ఎంత ప్రయత్నించినా శబ్దం కంఠం దాటి బయటికి రాందే? చివరికి అతి ప్రయత్నంమీద, "ఇది...గో!" అనగలిగింది. ఆయన తనకేసి తిరిగి ఆశ్చర్యంగా చూసి చిన్నగా నవ్వారు. ఆ నవ్వులో ఎన్నో అర్థాలు. మరి, మీ అయ్య లేడుగా? చెట్టుమీదనించి కాయ ఎలా దిగి వచ్చింది? పొమ్మని ఇప్పుడే అన్నదానివి ఇలా ఆప్యాయంగా వచ్చి ఇవ్వడానికి ఇంతలో కారణం ఏమిటి? ఇలా ఎన్నో ఎన్నో అర్థాలు ఆ నవ్వుకి. ఆయన నీళ్ళు తాగేసి కాలవ నీళ్లలోకి విసిరిన కొబ్బరి బొండం మునుగుతూ తేలుతూ ఆ ప్రవాహంలో పోతూఉంటే ఇవీ అని స్పష్టంగా చెప్పలేని సందేహాలు. బతుకును గురించిన భయాలు.

ఆలోచనలతో తనకి గుబులు వేసింది. ఇంక అక్కడ ఒక్క క్షణం ఆగలేక తడబడే కాళ్లతో తోటలోకి నాలుగు అంగల్లో వచ్చి పడింది. రోజూ నీళ్ళు పోసి ఎంతో గారాబంగా పెంచుకొంటూన్న మల్లెపందిరి దగ్గిర ఒక్క క్షణం ఆగింది. రోజూ తనకి సుఖాన్నిచ్చే ఆ పందిరి ఇవాళ ఒళ్ళంతా తెల్లని నవ్వులు నింపుకొని హేళన చేస్తున్నట్లు, తనకి బాధ కలిగిస్తున్నట్లు అనిపించింది. తనకి ఒళ్లు అంతా వేడి ఎక్కింది. చెమట పట్టేసింది. తోట మధ్య ఉన్న చిన్న చెరువులోకి దిగి నీళ్లు పోసుకుంటే బాగుండును అనిపించింది. కాని, తీరా నీళ్ళు పోసుకుంటూ ఉంటే బాతులన్నీ వచ్చి ఒక్కమారుగా నీళ్ళలో ఉరికాయి. పరధ్యానంగా ఉందేమో జడుసుకుంది. పైగా అవి ఉరకడంవల్ల తల అంతా తడిసిపోయింది. దానితో కోపం వచ్చి కింది పెదిమ పై పళ్లతో నొక్కిపెట్టి, కసిగా వాటిమీద రెండు చేతులతోటీ నీళ్ళు చెదరగొడుతూ. అవి దొరకకుండా ఈదుకునిపోతూంటే వాటితో

సమానంగా ఊదుతూ అలా ఎంతసేపు ఉందో తను! చెరువు గట్టునించి ఎవరో పకపకా నవ్వినట్టయితే అటు తిరిగి చూసింది. ఆయనే! మామిడిచెట్టుని మనక చీకట్లో ఆనుకొని నిలబడి ఈత కొడుతున్న తనని చూస్తున్నారు. తనకు వళ్ళుమాలిన సిగ్గు వేసింది. చేతులు రెండూ గుండెలకు అడ్డంగా పెట్టుకొని, తడి బట్టలేనా పిండుకోకుండా చెంగున పాకలోకి గెంతింది. కాస్సేపటికి బయటినించి ఆయన కంఠం వినిపించింది. ‘‘ఇదిగో, నేను వెళుతున్నాను. కాని, రేపు నేనో మారు రమ్మన్నానని మీ అయ్యతో చెప్పు.’’ ఆయన వెళ్ళి పోయిన అడుగుల చప్పుడు కూడా అయింది. అమ్మయ్య! తన కేదో పెద్ద బరువు తీరినట్లయింది. కాని, వెంటనే తరవాత ‘ఆయన మనస్సు ఎందుకు నొప్పించానా?’ అని నాలుగైదు రోజులదాకా బాధ పడుతూనే ఉంది.

ఆ నాలుగైదు రోజులూ ఆయన కాలవ గట్టున కనిపించలేదు కూడా. దానితో తనకి మరీ ఆందోళన ఎక్కువైంది. ఇప్పటి కప్పుడే చాలా రోజులనించి ప్రతి సాయంత్రం ఆయన కనిపిస్తూ ఉన్నారేమో, ఇలా నాలుగైదు రోజులు కనిపించకపోయేసరికి తనకేం తోచలేదు. కాలుగాలిన పిల్లిలా కాలవగట్టుకీ తోటకీ మధ్యన తిరిగేది. పైగా మల్లెపువ్వు కోస్తూంటే ఆయన్ని తను అన్నమాట ఒకటి. తను అలా అన్నందుకు కోపం వచ్చిందా? మరెందుకు రావడంలేదు? ఇలా ఆలోచించి ఆలోచించి తన మనస్సు వికలం అయిపో

కుర్రాణ్ణి ఎవరు చూస్తున్నారో!’’ అన్నాడు అయ్య.

దానితో తన మనస్సు మరీ వికలం అయిపోయింది. ‘‘నేనూ వస్తాను నీతో’’ అంటూ అయ్యతో జమీందారు గారి లోగిలికి బయలుదేరింది తను.

మంచంమీద ఒళ్ళు తెలియకుండా పడుకుని ఉన్నారు ఆయన. కొంచెం దూరంలో పడకకుర్చీలో కూర్చుని ఏదో పుస్తకం చదువుకుంటూ మధ్య మధ్య చేతిని ఉన్న వాచీ చూసుకుంటూ ఉంది డాక్టరమ్మ. పక్కనపట్టి ఏడుస్తున్న చంటిబాబుని ఊరుకో బెట్టలేక తికమక పడుతున్నాడు నౌఖరు. అదంతా చూసేటప్పటికి తనకి కళ్ళనీళ్ళ పర్యంతం అయింది. వెళ్ళి బాబుని తీసుకుని కబుర్లు చెప్పి ఆడించేటప్పటికి ఏడుపు మాని ఊరు



ఏదో ‘‘అయ్యో!’’ అని అసంతృప్తితో కూడి బాధ! ‘కాస్సేపు కూర్చోమని ఆయనతో నాలుగు మాట లయినా మాట్లాడకపోయానే’ అని పశ్చాత్తాపం. ఇలాంటి పశ్చాత్తాపమే తన కింకో మారు కలిగింది. ఏదో పనిమీద తను ఓ రోజున పాకలోనించి ఇవతలికి వచ్చేటప్పటికి ఆ జమీందారుగారబ్బాయి తను ఎంతో జాగ్రత్తగా పెంచుకుంటూన్న మల్లెపందిరి దగ్గిర నిలుచుని ఒక్క విచ్చి విడని పువ్వు కోస్తున్నారు. వెంటనే కోపంతో ముందు వెనకలేం ఆలోచించకుండా, ‘‘ఎందుకు కోశారు?’’ అంది కటువుగా. ‘‘ఇంకెప్పుడూ కొయ్యను మరి!’’ అని మృదువుగా అనేసి తల వంచుకుని మెల్లిగా అడుగులు వేసుకుంటూ వెళ్ళిపోయారు.

సాగింది. ఏ అలికిడి విన్నా కుమారి వస్తున్నారన్న ధ్యాసే ఆమెకు. దూడలకి నీళ్ళు పెట్టడం, గడ్డి వెయ్యడం ఇలాంటివన్నీ మరిచిపోతూంది. బయటా లోపలా ఏదో తీరని గుబులూ, బాధా.

ఇలా ఉండగా ఓ రోజున, ‘‘జమీందారుగారికి ఇవాళ టికి అయిదారు రోజులనించి ఒళ్ళు తెలియని జ్వరంట! పట్నంనించి ఓ డాక్టరమ్మని పిలిపించారుట! తలకి మంచుముక్కలు పెడుతున్నారుట! ఓమాటు అలా వెళ్ళి చూసి వస్తాను’’ అన్నాడు అయ్య. తన కా కబురు వినేటప్పటికి గుండె ఆగినంత పని అయింది. మనస్సు పరిపరి విధాల పోసాగింది.

‘‘పాపం, ఆయన అలా మంచాన్ని పడితే చంటి కున్నాడు. కాని, చూస్తే చాలా నీరసంగా ఉన్నాడు. అబ్బాయి అన్నం ముట్టుకుని వారం రోజులయిందనీ, కనీసం బిస్కట్లూ పాలూ అయినా దగ్గిరికి రానియ్యడం లేదనీ నౌఖరు చెప్పాడు. అని ఇలా తెమ్మని చెప్పి కబుర్లు చెప్పి బెలిపించి పెడుతూంటే ఒక్కొక్క బిస్కట్టే తినసాగాడు. గుమ్మంలోనించి పరకాయించి చూస్తుంటే బాబుగారు నీరసంగా కళ్ళుతెరిచి, తాను చంటివాడిచేత బిస్కట్లు తినిపించడాన్నే గమనిస్తున్నారు. అయ్యా, డాక్టరమ్మా ఇదేం గమనించకుండా ఏదో మాట్లాడుకుంటున్నారు. బిస్కట్లు తిని పాలు తాగేసరికి చంటిబాబుకి నిద్ర వచ్చింది. భుజం మీద పడుకోబెట్టుకుని అటూ ఇటూ తిప్పి, తీసుకువెళ్ళి

మంచం మీద పడుకోబెట్టి పక్క నో తలగడ అడ్డు పెట్టింది తను.

తన్ను చూసి డాక్టరమ్మ నవ్వుతూ, "నాలుగు రోజులు ఇక్కడ ఉండమ్మా" అంది. ఆ అనడం రెండు మూడుసార్లు అంది. అయ్య కూడా, "అవును. డాక్టరమ్మ మరీ మరీ అంటూంది. పోనీ, ఉండు. మన బాబు గారికి ఇలాంటి సమయంలో సేవ చెయ్యడంకంటే మనకి కావలసింది ఏమిటి?" అన్నాడు.

తను ఆలోచించుకునేలోపునే, అంతా నిర్ధారణ అయిపోయి అయ్య తన్ని అక్కడ వదిలి వెళ్లిపోయాడు.

చంటిబాబు నిశ్చింతగా నిద్రపోతున్నాడు ఉయ్యాలలో. నాలుగైదు రోజులనించి జమీందారుగారికి వైద్యం చెయ్యడంతో అలిసిపోయిందేమో డాక్టరమ్మ కూడా సోఫాలో కాళ్లు ముడుచుకొని గాఢంగా నిద్రపోతూంది. ఇంక ఎటొచ్చీ కొత్తచోటు వల్లో, అలవాటు లేనిది నేలమీద పడుకోవడం వల్లో తనకే నిద్ర పట్టడంలేదు. ఇంటి దగ్గర నులక మంచంమీద ఇట్టే పడటం వాల్చేటప్పటికి అట్టే నిద్ర పట్టేసేది. ఏమిటో ఇటూ అటూ ఒత్తిగిల్లుతూనే ఉంది రాత్రి తెల్లవార్లూ. ఓ రాత్రివేళ ఆయన మూలుగు విని పించింది. రాత్రి పడుకోబోయేటప్పుడు డాక్టరమ్మ అన్న మాటలు జ్ఞాపకం వచ్చాయి. 'ఆయన మూలిగినప్పుడల్లా ఈ ఐస్ బాగ్‌తో తల, నుదురు కాస్తున్నాను. కాని, రాత్రి తెల్లవార్లూ మెలకువగా ఉండి ఆయనకి ఆ సేవ చెయ్యలేకపోతున్నాను. పట్నంలో ఉన్నప్పుడు ఆయన నా కెన్నో ఉపకారాలు చేశారు. కాని, నేను రాత్రిళ్లు మెలకువగా ఉండి ఈ పని చెయ్యలేకపోతున్నాను. నౌకర్లు ఉన్నారు. కాని, ఏం లాభం? ఒక్కరికీ నిజమైన ప్రేమాదరాలు ఉన్నట్లు లేవు. మరి భార్య ఉంటే ఆయనకి ఇలా అయిఉండునా? రాత్రి తెల్లవార్లూ బాధ్యతతో మెలకువగా ఉండి ఈ ఐస్‌బాగ్‌తో ఆయన నుదురు కాచి తెల్లవారేటప్పటికి టెంపరేచర్ని నార్మల్‌కి తీసుకురాకుండా ఉండునా? ఏమిటో! ఆ అదృష్టమే ఉంటే అంత అన్యోన్యంగా ఉన్న సందర్భంలో ఆవిడ ఎందుకు చనిపోతుంది?' అంది. అంతే. ఆయన మూలుగు వింటూన్నకొద్దీ డాక్టరమ్మ మాటలు జ్ఞప్తికి వచ్చి తనకి స్తిమితం లేకుండా చేశాయి. ఇంక ఒక్క క్షణం పడుకొని ఉండలేకపోయింది. లేచి డాక్టరమ్మ ఐస్ కొట్టి బాగ్‌లో వెయ్యడం, ఆ పద్ధతి అంతా చూసిందేమో అలాగే తానూ చేద్దాం అని లైటు వేసింది.

కళ్లువిప్పి చూస్తున్న కుమార్ నోట్లోనించి ధర్మామీటర్ తీసి చూసి సంతోషంతో, "వెరీ గుడ్, నార్మల్ టచ్ చేసింది. ఇందుకు మీరు ఆ అమ్మాయికి కృతజ్ఞతలు చెప్పుకోవాలి. రాత్రి తెల్లవార్లూ ఐస్‌తో మీ తల కాస్తూనే ఉందిట" అంది డాక్టరమ్మ. ఆయన తనకేసి కృతజ్ఞతా సూచకంగా చూశారు. తనకి సిగ్గు వేసి తల దించివేసుకుని నేలకేసి చూస్తూ ఉండిపోయింది.

"మరి, నేనోమారు పట్నం వెళ్లివస్తాను. ఈ నాలుగైదు రోజులనించీ ఇక్కడే ఉండిపోయాను. అక్కడ పేషెంట్లు ఏమయ్యారో! ఈ అమ్మాయిని మాత్రం ఇక్కడ ఒకటి రెండు రోజులు ఉంచేసెయ్యండి" అని డాక్టరమ్మ వెళ్లిపోయింది.

ఆయనా తనూ తప్ప ఇంకెవరూ లేరు అనే ఆలోచన వచ్చేటప్పటికి తనకి చచ్చేటంత భయం వేసింది. డాక్టరమ్మ చెప్పిన ప్రకారం వేళ తప్పకుండా ఆయనకి మందూ పళ్లరసం అవీ ఇస్తూన్నప్పుడు పొరబాటున ఆయన వేళ్లు తనకి తగిలినా, తన కళ్లలోకి ఆయన చూసినా, "రత్నం! ఎంత శ్రమపడుతున్నావు?" అని పలకరించినా తనకి ఒళ్ళంతా ఝల్లుమని సుఖంగా అనిపించేది. ఏదో విచిత్రమైన ఉద్రేకానందాలతో కూడిన తియ్యని బాధతో ప్రతి క్షణమూ మరుపురాని ఒక మధుర స్మృతిగా నిలిచేది. అక్కడ గడిపిన ఆ అయిదారు రోజులూ ఆయనకి సేవ చేసి ఇంటికి వచ్చేశాకఏదో పోగొట్టుకొన్నదానిలా అయిపోయింది. తనకేం తోచేది కాదు. బరువైన బాధతో తను అలా రోజు రోజూ నెట్టుకు వచ్చేటప్పటికి గానమై పోసాగింది.

పైగా ఈ అయిదారు రోజులూ వెయ్యి కాల్చుకోవడంవల్ల పొయ్యి పొగపడక అయ్యకి మళ్లీ పాత దగ్గు తిరగబెట్టింది. ఖళ్లు ఖళ్లుమని రాత్రింబగళ్లు దగ్గు దానికితోడు కొత్తగా గుండెల్లో పోటొకటి వస్తూంది. తన కేం పాలుపోవడంలేదు. అయ్య పడుతున్న అవస్థ చూస్తే గుండెల్లోంచి దుఃఖం పొంగి వస్తూంది. ఎవరితోనేనా చెప్పుకుందాం అంటే చుట్టూ ఉన్నవాళ్లంతా తమలాంటి వాళ్ళేనాయెను! అయ్యో, పాపం! అంటూ జాలిపడి, ఓసారి వచ్చి చూసిపోగలరే కాని అంతకంటే ఏం చెయ్యగలరు? జమీందారుగారు వస్తే బాగుండును. కాని, ఆయనకి ఇంకా పూర్తిగా బలం చేరుకోలేదేమో! సాయంత్రం అప్పుడు కాలవగట్టుకేసి ఇంకా రావడంలేదు. అయ్య పరిస్థితి మరీ అధ్వాన్నం అయిపోతూంది రోజు రోజుకీ.

ఓ రోజున ఆయన వచ్చి కాలవ గట్టున మట్టిలో కూర్చున్నారు. ఎలా పలకరించాలో ఏం చెప్పాలో తోచలేదు. దగ్గిరికి వెళ్లి నించుంది ఆయనకేసి చూస్తూ. 'ఏం, రత్నం, అలా చూస్తావేం?" అన్నారు. ఏంఅనాలో తోచక "మారాజులు మట్టిలో కూర్చునారు" అంది తాను. నవ్వి, "మరి మట్టిలోనే కదా దొరుకుతాయి మాణిక్యాలూ రత్నాలూను" అన్నా రాయన తన కేసి చూస్తూ.

తన కా మాట ఓ రకంగా అర్థం అయింది. ఓ రకంగా అర్థం అవనూ లేదు. అయ్య పరిస్థితి చెప్పి ఆయన్ని గుడిసెలోకి తీసుకువెళ్ళింది. గుండె నెప్పితో బాధపడుతూ అయ్య ఈ లోకంలో లేడు. అయ్య పడుతూన్న బాధ చూసి, "అయ్యో! నాకు తెలిసిందే కాదు. ఉండు, పట్నంనించి డాక్టరమ్మను పిలిపిస్తాను. ఈ పల్లెలో మీ అయ్యకు ఎలా వైద్యలోపం జరుగుతూందో! పట్నంలో పదిమంది డాక్టర్లు ఉన్నచోట కూడా నా భార్యకుఇదే లోపం జరిగింది. దేశానికి ఈ దౌర్భాగ్యం ఎప్పటికి పోతుందో! నా అబ్బాయిని ఏమైనా డాక్టరీ చదివించి తీరాలి" అన్నారు.

ఉద్రేకంతో మాట్లాడుతూన్న ఆయన్ని చూస్తే తనకి అంత బాధలోనూ కూడా అవ్యక్తమైన ఆకర్షణ కలిగింది. ఆయన "మళ్లీ రేపు వస్తాను" అంటూ వెళ్లిపోబోతూంటే, దుఃఖంతో ఉబుకుతూన్న తన గుండెల్నీ బాధతో బరువెక్కుతూన్న తన శరీరాన్నీ అక్కడ ఓ స్తంభానికి ఆన్చి, "ఇన్ని స్థితిలో వదిలి వెళతారా?" అంటూ దీనంగా చూసింది. ఆయన వెనక్కి వచ్చి తనను ఆయనలోకి తీసుకోవాలని తనకి ఆకాంక్ష. ఆయన స్పర్శకై ఒళ్లంతా పులకరిస్తూన్న తనని అర్థం చేసుకోలేక, "రేపు మళ్లీ వస్తాగా?" అంటూ మామూలుగా అనేసి వెళ్లిపోయారు. తనకి నిట్టూర్పులు మిగిలాయి. "ఏం ఫరవాలేదు" అని డాక్టరమ్మ ధైర్యం చెప్పడంవల్లే తానూ నిశ్చింతగా ఉంది. ఆయనా మరేం భయం లేదనుకొని పట్నానికి వెళ్లారు, అబ్బాయిని కాన్వెంటులో చేర్చి ముందు చదివించబోయే నోడిసిన్‌కి ప్రాతిపదిక వెయ్యడంకోసం. కాని, డాక్టరమ్మ అంచనాలు తారుమారయి అయ్య తన్ని ఇలా దిక్కులేనిదాన్ని చేసేసి తన దారి తాను చూసుకుంటాడని ఎవ రనుకున్నారు?

తను ఏకాకి అయి అప్పటికి నాలుగు రోజు లయింది. ఏడ్చి ఏడ్చి ఎండిపోయిన కళ్లూ, అవిసి అవిసి అలిసిపోయిన గుండెలూ తన్ని ఓ నిర్జీవ ప్రతిమగా తయారు చేస్తే, తోట మధ్యలో ఉన్న చెరువు గట్టు అంచుమీద



తొలిపూజల దైవం

ఫోటో — పాట్నూరి సత్యనారాయణ (విజయవాడ-1)

నించుని దూరాన్న ఈదుతున్న బాతుల జంటని శూన్యంగా చూస్తూంది. వెనకనించి "రత్నా!" అని చల్లని పిలుపువిని ఉలిక్కిపడి ఇటు తిరిగేలోగా కాలికింద ఉన్న మట్టి బెల్లు విరిగి చెరువులోపడి, దానితోబాటే తను కూడా చెరువులో పడబోయింది. ఇంతలో తన్ని తటాలున పొదువుకున్న ఆ చేతులు! అబ్బ! ఎంత హాయిగా ఉన్నాయి! అనుకొని ఆ కౌగిలి ఎంత సుఖంగా ఉంది! మండు టెండలో అలిసి వచ్చిన తరవాత ప్రాణానికి సుఖంగా చల్లని నీడ ఇచ్చే పచ్చని పందిరిలా కుమార్!

పొటుపడ్డ ప్రాణం ఏమై తను తేలిగా అయిపోయి ఏ ఆలోచనాలేకుండా ఆయన గుండెలమీద తల ఆనించి ఆయన మెడ చేతులతో చుట్టేసి బావురుమంది. కొంతసేపు ఈ లోకాన్నే మరిచిపోయి. చాలాసేపటికి కాని తాను తేరుకోలేదు. తేరుకుని తన తొందరపాటుని అర్థం చేసుకుని ఆయన చుట్టూ ఉన్న తన చేతుల్ని తీసివేసినా, ఆయన మాత్రం తన చుట్టూ వేసిన చేతుల్ని

# రత్తాలు

తియ్యకుండా తనని ఒడిలోకి తీసుకున్నారు. కొబ్బరి చెట్టుమీదినించి పండుటాకట రాలింది. తను కుమార్ ఒళ్ళో వాలింది.

చిరుచెమటతో తడిసి నుదుటిమీద పడుతూవున్న తన ముంగురుల్ని ఆయన సర్దుతూవున్న దృశ్యం తనకు ఇప్పటికీ మనఃఫలకంమీద శాశ్వతంగా ముద్రితమయి ఉంది. కాని, జరిగిన దేమిటో ఆలోచించే స్థితికి రాలేదు తను. తెలుసుకొనేసరికి ఒళ్ళు భయంతో జలదరించింది. ఆయన పైన ఉన్న వ్యామోహం తనచేత ఎంత పని చేయించింది! ఇప్పుడెలా? అంటూ దిగాలుగా కన్నీళ్ళు పెట్టుకుంటున్న తనని దగ్గిరగా తీసుకొని లాలిస్తూ, ''ఎందుకు, రత్నం అంత, దిగులు? నిన్ను నేను అన్యాయం చెయ్యను. నమ్ము. మన దేనాటి సంబంధమో! ఎప్పటికీ నువ్వు నా దానివే!'' అన్నారు.

చంద్రం ఇంకో రెండు మూడు నెలల్లో పుడతాడనగా ఆయన తనని మద్రాసు తీసుకువెళ్ళి అక్కడ ఓ ఆసుపత్రిలో చేర్పించారు. చంద్రం పుట్టాక వాడికీ తనకీ ఒక మంచి ఇల్లొకటి మద్రాసులోనే చూసి, ''ఆ పల్లెటూళ్ళో ఉంటే పదిమందీ కాకులు పొడిచినట్లు పొడుస్తారు. ఇక్కడే ఉండండి. తరుచు వచ్చి చూస్తూ ఉంటాను'' అని చెప్పి నెలకో రెండు నెలలకో ఓమారు వచ్చి చూస్తూ ఉండేవారు. తరవాత కొన్ని నెలలు పోయాక ఆయన రావడం మానేశారు. ప్రతి నెలా మాత్రం తప్పకుండా డబ్బు పంపేవారు. చంద్రానికి అయిదేళ్ళు వచ్చాక కాబోలు, ముప్పైవేల రూపాయలు ఫిక్సెడ్ డిపాజిట్ తనపేర వేసి ఒక పుస్తకమూ, దానితో ఆయన ఫొటో ఒకటీ, ఓ ఉత్తరమూ వ్రాసి అవన్నీ పోస్టులో పంపారు.

కుర్రవాడికి చదువు వచ్చే ఎత్తేం కనిపించడం లేదనీ వాడిని డాక్టర్ని చెయ్యాలంటే తను ఎక్కువ శ్రద్ధ చూపించాలనీ, జమీందారీ వ్యవహారాలు కూడా చిక్కులలో పడ్డాయనీ, దానాదీనా తరుచు రాలేననీ, అయినా ఈ డబ్బు దగ్గిర ఉంచుకొని దానిమీద వచ్చే వడ్డీతో కాలక్షేపం చేస్తూ చంద్రాన్ని కూడా మంచి చదువు చదివించమనీ, వీలు చూసుకొని నాలుగైదు నెళ్ళలో ఓమారు వచ్చి చూస్తాననీ వ్రాశారు ఆ ఉత్తరంలో.

తరవాత అయిదారు ఏళ్ళు చూసి తను మద్రాసు వదిలి చంద్రంతో ఆ ఊరూ ఆ ఊరూ తిరిగింది కాని, తెగించి కుమార్ ఉన్న ఊరికి, తాను చిన్నప్పుడు పెరిగిన చోటుకి వెళ్ళలేకపోయింది. తరుచు వాకబు చేస్తోంటే కుమార్ కొడుకు చదువు అంటక పాడైపోయాడనీ, అందువల్ల ఆయన విరక్తి చెంది, దేశాలు పట్టి వెళ్ళిపోయారనీ తెలిసింది. చంద్రం డాక్టర్ అయ్యాడని తెలిస్తే ఆయన ఎంత సంతోషించేవారో అని తాను ఎన్నిమార్లో అనుకుంది. కాని, ఆ అవకాశం ఇంత వరకూ ఎప్పుడూ లభించలేదే!

ఇదిగో, ఇప్పుడు — ఇన్నాళ్ళకి!

కాని?...కాని?...ఎంత భయంకరంగా వచ్చింది ఈ అవకాశం! ఆయన ఏదో ప్రమాద స్థితిలోనే ఉండి ఉంటాడు. లేకపోతే చంద్రం అంత కంగారుగా వెళ్ళడు. ఆయన తన తండ్రి అని వీడికీ, వీడు తాను పెట్టిన దీపమే అని ఆయనకీ తెలియదు కదా! ఇలా ఆ తండ్రీ కొడుకులు ఒకరి కొకరు తెలియకుండా ఉండిపోవడానికి వీలులేదు. తన జీవిత రహస్యాన్ని దాచుకోవడంకోసం ఆ తండ్రీ కొడుకులకి తాను అన్యాయం చెయ్యకూడదు. ఉన్న విషయం చెప్పెయ్యాలి. అవును, చెప్పేస్తుంది. ఇంక ఒక్క క్షణం కూడా ఆలస్యం పనికిరాదు. వెళ్ళాలి. హాస్పిటల్‌కి పరిగెత్తుకు వెళ్ళాలి. వెళ్ళాలి...తను వెళ్ళాలి.

హాస్పిటల్‌లోకి సుడిగాలిలా వచ్చిన రత్తాలుని చూసి చంద్రం విస్తుపోయి కంగారు పడుతూ, ''ఇలా వచ్చా వేమిటి, అమ్మా! ఏం జరిగింది? ఏం జరిగింది?'' అన్నాడు.

వచ్చే దుఃఖాన్ని ఆపుకుంటూ, ''ఏరీ...వా రేరీ... ఎక్కడ? నిన్నే! చంద్రం!'' అంటూ రత్తాలు ఇటూ అటూ దిక్కులు చూసి, స్పెషల్ వార్డులో బెడ్‌మీద ఉన్న కుమార్‌ని ఆనవాలు పట్టి తెరిచి ఉన్న ఆ ద్వారం దగ్గిరకి పరిగెత్తింది. చంద్రం కూడా కంగారుగా ఆమెను అనుసరించాడు ఏమీ అర్థంకాక.

అక్కడక్కడ నెరిసిన జుట్టు, ముడతలు పడిన మొహం. ఎంతో ప్రయత్నంమీద కాని ఊపిరి పీల్చుకో లేకపోతూ కళ్ళు మూసుకుని బెడ్‌మీద పడుకుని ఉన్న కుమార్‌మీద వాలి, ''ఏమండీ, నేను మీ రత్నాన్ని. ఇడుగో, మన చంద్రం. ఒక్కమారు ఇటు చూడండి'' అంటూ దుఃఖంతో పూడుకుపోయిన కంఠంతో అంది రత్తాలు. కుమార్ నీరసంగా కళ్ళు తెరిచి రత్తాలుని పోల్చుకుని, ఆనందంతో ముఖం అంత బాధలోనూ కాంతివంతం కాగా, ''ఇన్నాళ్ళకి చూశాను నిన్ను, రత్నం!'' అని ఆమె ముఖంమీద పడుతున్న జుట్టు వెనక్కి తోస్తూ, ''చిన్నబాబు చదువూ సంధ్యా లేక పూర్తిగా భ్రష్టుడైపోయాడు. డాక్టర్ని చెయ్యాలనే నా ఆశలు...హుఁ!... మన చంద్రం అయినా...'' అనబోతూంటే, ''ఇడుగో!'' అని రత్తాలు చంద్రాన్ని చూపించి, తెల్లబోయి చూస్తూన్న చంద్రంతో, ''మీ నాన్నగారు...'' అంది. మెళ్ళో స్టెతస్కోపుతో కనపడ్డ చంద్రాన్ని చూసి కుమార్ అంతా అర్థం చేసుకుని ఆనందం పట్టలేక చేతులు రెండూ చాపాడు. ఆ తండ్రీ కొడుకులు ఒకరి నొకరు కౌగిలించుకోవడం చూసి రత్తాలు ఆనందంతో పరవశించి కళ్ళలో నీళ్ళు నింపుకుంది.

చంద్రాన్ని కౌగిలించుకున్న కుమార్‌కి చంద్రం డాక్టర్ అయ్యాడనే ఆనందం వల్లో, ఆతన్ని అలా తయారు చెయ్యగలిగిన రత్నంశక్తిసామర్థ్యాలు ఎంతటివి అని ఆశ్చర్యపడగా వచ్చిన సంతృప్తి వల్లో, అయ్యో! చిన్న బాబుని ఇలా తయారు చెయ్యలేకపోయానే అనే బాధ వల్లో, ఇన్నాళ్ళకి నా రత్నాన్నీ చంద్రాన్నీ చూడగలిగాను కదా అనే తృప్తి వల్లో, ఈ ఆనందం ఇంకొంచెంసేపు అనుభవించడానికి వీలు లేకుండా తన ఆయుర్దాయం కొన్ని నిమిషాలకి మాత్రమే పరిమితం అయి ఉందనే ఆవేదన వల్లో, ఎందువల్లో కళ్ళు చెమ్మగిలి చెంపల మీదుగా రెండు ధారలు కట్టాయి. కుమార్ పరిస్థితి తెలిసిన చంద్రానికి ఆ కన్నీళ్ళ అర్థం ఓలాగ భాసిస్తే, అమాయకురాలైన రత్తాలుకి మరోలా భాసించింది పాపం! ★

ఈ వారం పాఠక శ్రోతల లేఖలకే ప్రాధాన్యం ఇవ్వాలని సంకల్పించాను. దీనికి కారణం లేకపోలేదు. అధిక సంఖ్యాకులు వ్రాస్తున్నారు. వారి ఆసక్తి, ఉత్సాహం పోషించడము, సాధ్యమైనంత అధికంగా వారి అభిప్రాయ ప్రకటనకు అవకాశం కల్పించడము ఈ శీర్షిక ప్రధాన లక్ష్యాలలో ఒకటి.

చిత్రమేమంటే పాఠకశ్రోతలు కూడా అధికంగా తెలుగు వార్తలకే ప్రాధాన్యమిస్తున్నారు. దీనికి ముకర్లో బాధ్యత కూడా కొంత ఉందేమో?

## గోదావరి వరద

సత్తెనపల్లినుంచి శ్రీ పి. వెంకటేశ్వరరావు ఇలా వ్రాస్తున్నారు: ''సెప్టెంబరు 6వ తేదీ మంగళవారం ఉదయం తెలుగు వార్తల ప్రసారానికి ముందు గోదావరి వరద ప్రమాదం అధికంగా ఉందని విజయవాడ కేంద్రం ప్రకటించింది. కాని (ఆతరవాత ప్రసారమైన) తెలుగు వార్తలలో అసలు గోదావరి విషయం ప్రస్తావించలేదు. ఆ వార్తలలో రొడీషియా విషయంలో ఇండియా చేసిన ప్రతిపాదనను కామన్వెల్తు సమావేశంలో అందరూ ఆమోదించారని పదే పదే చెప్పారు. అంటే తెలుగు శ్రోతలకు చెవుడని వారి అభిప్రాయమా? లేకపోతే గోదావరి వరద ప్రమాదాన్ని అసలు ప్రస్తావించకుండా పై వార్తను అయిదారు సార్లు నొక్కిచెప్పడంలో గల అర్థమేమిటి?''

కారణం ఒక్కటే—దూరాభారం. గోదావరి వరదలు ఢిల్లీకి పాకడానికి వ్యవధి చాలదు!

ఆ మరునాటి విశేషం. . .

## దశాబ్దం తేడా

రాజమండ్రి—3 నుంచి శ్రీ ఎస్. జి. బాబా ఇలా వ్రాస్తున్నారు:

''సెప్టెంబరు 7 అపరాహ్నం 1—50 గంటలకు తెలుగు వార్తలలో గోదావరి నదికి వరదలు వస్తూన్నట్లు, ఇదివరకు ఒకసారి 1963లో పెద్ద వరదలు వచ్చి రాజమండ్రి జలమయం అయినట్లు చెప్పారు. కాని ఆశ్చర్యకరమైన విషయం ఏమంటే రాజమండ్రి మునిగిన వరదలు 1953లో వచ్చినవికాని 1963లో అనగా మూడేళ్ళ క్రిందట వరదమట్టం రాజమండ్రి వంతెన వద్ద 65 అడుగులు రాలేదు, రాజమండ్రి మునగనూ లేదు.''

ఒక్క దశాబ్దానికే ఇంత రభసా! ఆ వివరాలు ఢిల్లీ చేరేసరికి ఒక దశాబ్దం పట్టి ఉంటుంది. కాగా అవి 1963 కు సంబంధించినవే అని అధికారులు భ్రమపడి ఉండవచ్చు.

## సుగంధ ద్రవ్యాలు

హైదరాబాదు—12 నుంచి శ్రీ ఎస్. ఎమ్. ఎల్. ఎన్. హరిగోపాల్ ఇలా వ్రాస్తున్నారు:

''సెప్టెంబరు 12 వ తేదీ సాయంత్రం 6—20 గంటలకు ప్రసారమైన వ్యావసాయిక విషయాలలో ఆఖరిని ధరలు చెబుతూ ఆయన, సుగంధ ద్రవ్యాలు అని చెప్పి మిరపకాయలు, బెల్లము, తమలపాకుల